# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని నౌకా, విమానాశ్రయాల నిర్మాణాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ టెక్స్‌టైల్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

4. **సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

==========================

రాష్ట్రంలోని నౌకా, విమానాశ్రయాలు, హార్బర్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆర్టీసీపై నిన్న నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అనుమతులు, టెండర్లు, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆర్టీసీ ఆస్తులను సమర్థంగా వినియోగించి సంస్థను బలోపేతం చేసే ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాల నిర్మాణం, భూసేకరణ, నిధుల సమీకరణ, కేంద్ర అనుమతులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ టెక్స్‌టైల్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ వెల్లడించారు. 2030 నాటికి దేశం నుంచి 350 బిలియన్ డాలర్ల టెక్స్ టైల్ ఉత్పత్తుల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విజయవాడలో నిన్న నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత, హస్త కళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. చేనేత, హస్త కళాకారులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తూనే, పర్యావరణ పరిరక్షణకు నార ఉత్పత్తుల తయారీని ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు.

-------------------------

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్–2లో క్లిష్టమైన 5.2 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పూర్తి చేశామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునీకరించే లక్ష్యంతో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ అంశంపై ఆర్టీసీ, ట్రాన్స్ కో తదితర శాఖల అధికారులతో గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిన్న నిర్వహించారు. రాష్ట్రానికి 750 విద్యుత్ బస్సులు మంజూరయ్యాయని, ఈ బస్సుల కొనుగోలుతో పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు సమకూరుస్తున్నాయని అన్నారు. అన్ని ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి, ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో ఉద్యాన పంటల నుంచి ఉత్పత్తి అవుతున్న పీచు, నారకు ప్రోత్సాహం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో కేంద్ర మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అరటి, వెదురు, పోక చెక్క ఆకులు, కొబ్బరి పీచు వంటి వనరులతో పర్యావరణ అనుకూల నార ఉత్పత్తుల తయారీకి విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. అరటి సాగవుతున్న జిల్లాల్లో నార ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, స్వయం సహాయక సంఘాల కోసం క్లస్టర్ ఆధారిత యూనిట్లకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

---------------------------

ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకరమైన ఓటరు జాబితా కీలకమని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సంతోష్ కుమార్ దూబే పేర్కొన్నారు. దోషరహిత ఓటరు జాబితా లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడలో నిన్న నిర్వహించిన సన్నాహక సమావేశంలో సంఘ మరో కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చడంతో పాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉన్న వారి వివరాలను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయడమే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లక్ష్యమని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాదులో ఒక సంస్థ నిన్న నిర్వహించిన ఆర్గానిక్ మేళాలో పాల్గొన్న ఆయన.. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటోందని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజాహిత పరిపాలన అందిస్తూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఉజ్వల్ యోజనలో లబ్ధిపొందిన ప్రకాశం జిల్లా, ఒంగోలులో నివాసం ఉండే స్వయం సహాయక సంఘం సభ్యురాలైన జానకి మాట్లాడుతూ..

వాయిస్..20 సెకన్లు

ప్రైవేట్ ఉద్యోగం చేసుకునే ఒంగోలు నగర వాసి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, ప్రధాన మంత్రి మోదీ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో ఆయుష్మాన్ భారత్ పథకం సామాన్యులకు ఎంతో ఉపయోగపడిందని వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఎండల తీవ్రత, పిడుగులతో కూడిన వర్షాలతో విభిన్న వాతావరణ పరిస్థితులు మరో రెండు రోజులు నెలకొంటాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రేపటి నుంచి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజు 11 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 64 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, దాని ఆనుకుని ఉన్న తమిళనాడు తీరంపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ రోజు, రేపు రాయలసీమలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

తెలంగాణలో ఈరోజు ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

======================